# ప్రజాశక్తి

శుక్రవారం 20 అక్టోబర్ 2023 8 పేజీలు


గుంటూరు


పల్నాడు



గుంటూరులో దీక్షలు

2 లో



నరసరావుపేటలో దీక్షలు

# ఒపిఎస్‌కే ఉద్యోగుల ఓటు


- యుటిఎఫ్ నిరవధిక దీక్షల్లో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు
- పల్నాడులో దీక్షలకు రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ సంఘీభావం

# దిగుబడి దిగులు

- వర్షాభావంతో తల్లడిల్లుతున్న రైతులు
- 20 రోజులుగా ముఖం చాటేసిన వానలు
- కాల్వలకు పూర్తిగా అందని నీరు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో 20 రోజులుగా వర్షాలు కురకపోవడం, జలాశయాల్లో నీటి నిల్వలు పెరగక కాల్వలకు తక్కువ స్థాయిలో నీరు విడుదల చేయడం వల్ల పైర్ల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతోంది. ఇది రానున్న రెండు నెలల కాలంలో దిగుబడులపై తీవ్రంగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలిపి వరి 1.65 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం వరి పొట్టదశకు చేరుకుంటున్న తరుణంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. డెల్టాలో రోజుకు ఆరువేల క్యూసెక్కులకు గాను 3 వేల వరకు విడుదల చేస్తున్నారు. తెనాలి, పెదకాకాని, చేబ్రోలు తదితర మండలాల్లో కాల్వలకు నీరందక డెల్టాలోనే వరిపైరు ఎండిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరి దిగుబడి కనీసం 30-40 బస్తాలు వస్తాయి. అయితే ఈసారి 20-25లోపు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇదే పరిస్థితి ఇంకా రెండునెలలు కొనసాగితే మాత్రం దిగుబడి ఇంకా తగ్గే ప్రమాదం ఉందంటున్నారు. వరికి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు.

సాగర్ ఆయకట్టు పరిధిలో కాల్వలకు నీటి విడుదల బుధవారం నిలిపివేశారు. తాగునీటి అవసరాల పేరుతో కేవలం ఐదు టీఎంసీలనే గత వారం రోజులుగా సరఫరా చేశారు.

రెండు జిల్లాల్లో కలిపి దాదాపు 1.25 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు జరిగింది. మిర్చి పైరు ఎదుగుదల దశలో ఉంది. రెండు నెలల క్రితం సాగు చేసిన ప్రాంతాలలో పూత దశలో ఉంది. ఈ పరిస్థితుల్లో వర్షాలు లేక, కాల్వలకునీరు రాకపోవడం వల్ల పైరు బెట్టకు వస్తున్నాయి. మిర్చికి కనిష్టంగా 10 క్వింటాళ్లు వస్తాయని ఆశలో రైతులు ఈ ఏడాది మిర్చి సాగు చేశారు. కానీ మిర్చి పంటకు మూడు తడుల్లో నీటి అవసరం ఉంది. ఇప్పటి వరకు ఒక్కతడి కూడా పూర్తి కాలేదు. అక్టోబరు, నవంబరు నెలల్లో తుపాన్లు వస్తే డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు మూడు తడులు పెడితే కనీసం 10-15 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మిర్చికి ధర ఆశాజనకంగా ఉంటోంది. కనీసం రూ.15 వేలకు తగ్గడం లేదు. రైతులు ఎకరాకు రూ.లక్షకు పైగాపెట్టుబడి పెడుతున్నారు. చీడపీడల ప్రభావం లేకపోతే నాణ్యమైన మిర్చి వస్తుంది. కానీ ఈ ఏడాదిమిర్చి సాగు గాలిలో దీపంలా

▶ 2లో

# 15న ప్రజారక్షణభేరి సభ

## జయప్రదానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

విజయవాడలో వచ్చేనెల 15న జరిగే 'ప్రజారక్షణ భేరి' బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. గురువారం బ్రాడీపేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి అధ్యక్షతన నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ నిత్యావసర సరుకులు ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని, మరోవైపు ప్రజలకు ఉపాధి లేక అర్ధాకలితో అలమటిస్తున్నారని అన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడం, సిమెంట్, ఇనుము ఇతర బిల్డింగ్ మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో భవననిర్మాణ కార్మికులకు చేతినిండా పని లేదన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దళితులు, గిరిజనలు, మైనార్టీలపై దాడులు పెరిగాయని విమర్శించారు. మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు, గృహదహనాలు, మహిళలపై అత్యాచారాలు జరగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ మణిపూర్ రాష్ట్రాన్ని సందర్శించలేదన్నారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు అడ్డగోలుగా పెంచిందని, సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన ఛార్జీల పేరుతో అదనపు భారాలు మోపిందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలు, పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించకుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు పోరాడకుండా రాజీ ధోరణిని అవలంభించడం

▶ 2లో



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

## మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్‌కు అస్వస్థత

2 లో

## దుకాణంలో ప్రమాదకర మందులు

అల్యూమినియం ఫాస్ఫేట్, జింక్ సల్ఫేట్ స్వాధీనం

2 లో


వ్యవసాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న సల్ఫాస్ మరియు జింక్ ఫాస్ఫేట్ టాబ్లెట్లు

## భవిష్యత్ కోసం విద్యార్థులను సిద్ధం చేయాలి

- పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక ఉండాలి
- నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్
- అకాడమీ, పరిశ్రమ భాగస్వామ్య పురోగతిపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్

2 లో

## దుకాణంలో ప్రమాదకర మందులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రమైన దుగ్గిరాల రైలుపేటలోని హేమలత ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్‌ను వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులు గురువారం తనిఖీ చేశారు. 26 అల్యూమినియం ఫాస్పేట్ (సల్ఫాస్ టాబ్లెట్లు) బాటిల్స్‌ను, 29 ప్యాకెట్ల జింక్ సల్ఫేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.30 వేల వరకూ ఉంటుందని అధికారులు తెలిపారు. అత్యంత ప్రమాదకరమైన సల్ఫాస్ టాబ్లెట్లు పసుపు బస్తాల్లో గోడౌన్లలో పుచ్చు పట్టకుండా వాడుతారు. లైసెన్స్ లేకుండా అమ్ముతున్నందుకు వీటిని వ్యవసాయ శాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుకాణం యజమానిపై కేసు నమోదు చేశామని, శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామని అధికారులు తెలిపారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్.ఉషారాణి, దుగ్గిరాల, కొల్లిప మండలాల వ్యవసాయ శాఖాధికారులు పి.శిరీష, కె.వెంకటరావు ఎఇఒ రమేష్, వీఆర్వోలు మహేష్, ఫకీరయ్య పాల్గొన్నారు.



## మహిళా కమిషన్ మాజీ చైర్పర్సన్ కు అస్వస్థత

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ స్థానిక ఐతానగర్లో చేపట్టిన దీక్షా శిబిరాన్ని గురువారం సాయంత్రం ఆమె సందర్శించారు. దీక్షాపరులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. అనంతరం ఆమె శిబిరంలోనే అస్వస్థతకు గురై తనను ఆస్పత్రికి తీసుకెళ్లాలని అక్కడున్న నాయకులను కోరారు. వెంటనే తెలుగు మహిళ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు అన్నాబత్తుని జయలక్ష్మి తదితరులు ఆమెను ఆసుపత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## చంద్రబాబు త్వరలోనే బయటకు వస్తారు : వర్ల రామయ్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

చంద్రబాబు నాయుడు త్వరలోనే బయటకు వస్తారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు గురువారం వచ్చిన ఆయన స్థానిక గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చారని మళ్లీ సిఎం కావడానికి అడ్డదారులు తొక్కుతున్నారని ఎద్దేవాచేశారు. దీనికి జీ హుజూర్ అనేలా పోలీస్ శాఖ పని చేస్తోందని, కొద్దీ మంది పోలీసులే నిజాయితీగా పని చేస్తున్నారని అన్నారు. పల్నాడు ఎస్పీ వైసిపి సెక్షన్లు అమలు చేస్తున్నారని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభివృద్ధి చేసిందేమీ లేదని, దీనిపై ఆయన క్రిమినల్ మైండ్ కలిగిన వ్యక్తి అని మండిపడ్డారు. కావాలనే జగన్ పై కోడికత్తి దాడి జరిగిందని ఎన్ఐఎ అధికారులు తేల్చారని చెప్పారు. ఈ కేసులో నాలుగున్నరేళ్లుగా దళిత యువకుడు జైలు శిక్ష అనుభవిస్తున్నాడని అన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్‌తో ప్రజల ఆగ్రహాన్ని మూటగట్టుకున్న వైసిపికి రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు అరెస్ట్ ద్వారా టిడిపి శ్రేణులను నిరుత్సాహానికి గురి చేసి ఎన్నికల్లో గెలవాలనే మైండ్ గేమ్ వైసిపి అడుతోందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.బ్రహ్మయ్య, జి.జనార్ధన్ బాబు, వి.సింహాద్రి యాదవ్, మస్తాన్‌వలి, నవీన్, ఎం.జాహ్నవి, శివప్రసాద్ పాల్గొన్నారు.

# ఒపిఎస్‌కే ఉద్యోగుల ఓటు




గుంటూరు దీక్షల్లో మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - గుంటూరు, పల్నాడు జిల్లా

సిపిఎస్, జిపిఎస్‌ను ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, పాత పెన్షన్ విధానం రద్దు చేసే వారికే రానున్న ఎన్నికల్లో ఓట్లు వేస్తారని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. సిపిఎస్, జిపిఎస్ వంటి ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ ఉన్న ఏ విధానమైనా అంగీకరించేది లేదని, ఒపిఎస్ అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు, ఒపిఎస్ సాధనకు యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరు కలెక్టరేట్ ఎదుట గురువారం నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభించారు. తొలుత యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె.జోజయ్య, దుర్గారావు, తాండవకృష్ణ, రాష్ట్ర, జిల్లా నాయకులు దీక్షా శిబిరం వద్ద ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నసరావుపేటలోని ధర్నా చౌక్ వద్ద దీక్షలను ఉపాధ్యాయులకు పూల మాలలు వేయడం ద్వారా వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయ నాయక్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జి.రవిబాబు ప్రారంభించారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో యుటిఎఫ్ దీక్షలకు రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ సంఘీభావం తెలిపారు. మధు మాట్లాడుతూ ఒపిఎస్ అమలు కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటం న్యాయమైందన్నారు. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వస్తే ఒపిఎస్ అమలు చేస్తామని కెసిఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. గఫూర్ మాట్లాడుతూ జిపిఎస్ విధానంతో ఉద్యోగులు రగిలిపోతున్నారని, అయితే అక్రమ కేసులతో ఇబ్బందులు పెడతారని భయంతో ఉద్యోగులు మాట్లాడలేక పోతున్నారని చెప్పారు. ఈ క్రమంలో యుటిఎఫ్ ఉపాధ్యాయులు ముందుకొచ్చి ఒపిఎస్ కోసం పోరాడ్డం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా 40 ఏళ్ల పాటు సేవ చేసిన వ్యక్తుల బాధ్యత ప్రభుత్వాన్ని కాదా? అని ప్రశ్నించారు. గుంటూరు దీక్షలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గత ఎన్నికల్లో సిపిఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి, మాట తప్పిందన్నారు. నాలుగున్నరేళ్ల పాలన తర్వాత జిపిఎస్‌ను తెరపైకి తెచ్చిందని, ఇది కూడా ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తోనే ఉంటుందని అన్నారు. హామీ ఇవ్వకపోయినా అనేక రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. హామీ ఇచ్చిన ఏపీ ప్రభుత్వం మాత్రం అమలు చేయకపోటం అన్యాయమన్నారు. రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఉద్యోగులకు పలు పార్టీలు ఒపిఎస్ హామీ ఇస్తున్నాయన్నారు. ఏపీలోనూ సిపిఎస్ రద్దు చేసే వారికే ఉద్యోగులు ఓటు వేస్తారని స్పష్టం చేశారు. జోజయ్య మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న పెన్షన్ విధానాన్ని పాలకులు కార్పొరేట్ల కోసం నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్.కుసుమకుమారి మాట్లాడుతూ ప్రభుత్వం పాత పెన్షన్ ఇస్తామని మోసగించిందని విమర్శించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ పండుగ సెలవుల్లో సైతం యుటిఎఫ్ ఈ ఉద్యమానికి సిద్ధమవటం, అన్ని జిల్లాల్లో విజయవంతంగా దీక్షలు జరగటం జిపిఎస్ పట్ల సిపిఎస్ ఉద్యోగుల్లో ఉన్న వ్యతిరేతకు నిదర్శమన్నారు. ఒపిఎస్ సాధించే వరకూ ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. 2003 నోటిఫికేషన్ ద్వారా 2004లో ఉద్యోగాల్లో చేరిన వారికి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. నరసరావుపేటలో దీక్షలో యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి మాట్లాడుతూ జిపిఎస్ విధానం అంటే ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలపై నీళ్ల చల్లడమేనన్నారు. రాజకీయ పార్టీలు విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని పదేపదే చెబుతున్న ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దుపై ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. ఒపిఎస్‌కు జిపిఎస్ ప్రత్యామ్నాయం కాదని, ఇది వంచనేనని మండిపడ్డారు. షేర్ మార్కెట్లో లాభనష్టాలపై ఆధారపడే పెన్షన్ ద్వారా సామాజిక భద్రత ఎలా ఉంటుందని ప్రశ్నించారు. దీక్ష శిబిరాన్ని సందర్శించిన సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మద్దతు తెలిపారు. భవిష్యత్ తరాలకు విద్యాబుద్ధులు నేర్పి, క్రమశిక్షణ కలిగిన పౌరులను తయారు చేసే ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సి రావడం దురదృష్టకరమన్నారు. ఇతర రాష్ట్రాల్లో సాధ్యమైన ఒపిఎస్ ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. యుటిఎఫ్ చేసే పోరాటాలకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. గుంటూరు దీక్షల్లో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు, జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఎఎల్. శివపార్వతి, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, ఎమ్‌డి.షకీలాబేగం, జి.వెంకటేశ్వరరావు కూర్చుకున్నారు. జిల్లా కోశాధికారి ఎమ్‌డి.గయాసుద్దొలా పాల్గొన్నారు. నరసరావుపేట దీక్షలో కె.శ్రీనివాసరెడ్డి, జె.వాల్యా నాయక్, టి.అరుణ్ కుమార్, షేక్ జమాల్, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, బి.కాంతారావు, అయేషా సుల్తానా, ఎన్.పద్మావతి, వి.నాగేశ్వరరావు, ఎ.నాసర్‌రెడ్డి, కె.కోటేశ్వరరావు, పి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

# భవిష్యత్ కోసం విద్యార్థులను సిద్ధం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్.సురేష్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ప్రపంచం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయడానికి పరిశ్రమ-అకాడమీ మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమని నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక ఉండాలని, విద్యార్థులు ఆచరణాత్మక నైపుణ్యాలనూ పొందగలిగేలా విద్యా వ్యవస్థను మెరుగుపరచాలని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కాలేజీలకు చెందిన ప్రిన్సిపాళ్లు, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ అధికారులకు సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సురేష్ కుమార్ మాట్లాడుతూ మంచి విద్యా బోధనకు అధ్యాపకుల శిక్షణను తప్పనిసరి చేయాలని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాంకేతిక విద్య కమిషనర్ సిహెచ్.నాగరాణి మాట్లాడుతూ పాలిటెక్నిక్‌ల ముంగిటకు బహుళజాతి కంపెనీలను తెచ్చి డిప్లొమా విద్యార్థులకు అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. పరిశ్రమలతో అవగాహన ఒప్పందాల అమలు, పాఠ్యప్రణాళిక పునరుద్ధరణలో పరిశ్రమల భాగస్వామ్యం, ఫ్యాకల్టీ ఇండస్ట్ వంటి పరిశ్రమల అనుసంధాన కార్యక్రమాల నిర్వహణతో అర్థవంతమైన సాంకేతిక విద్యను అందించామన్నారు. ఎన్నడూ లేని విధంగా దాదాపు 60 శాతం మంది విద్యార్థులకు ఈ సంవత్సరం ఉపాధిని చూపామని తెలిపారు. డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కెఎస్ లక్ష్మీపతి మాట్లాడుతూ ఇండస్ట్రీ-అకాడమీ సహకారం యొక్క కీలక పాత్రను గుర్తించి పాలిటెక్నిక్ అధ్యాపకులకు నెల రోజుల పాటు పారిశ్రామిక శిక్షణ ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సుజ్లాన్ గ్లోబల్ సర్వీసెస్ లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ మరియప్పన్ మాట్లాడుతూ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను ముందుకు తీసుకెళ్లడానికి, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని పెంపొందించడానికి విద్యారంగం, పరిశ్రమల మధ్య సహకారం అవసరమని చెప్పారు. హెస్ట్ అల్లాయ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ ఫౌండ్రీ రంగంలో డిప్లొమా విద్యార్థులకు అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. పరిశ్రమ, విద్యా వ్యవస్థల మధ్య సంబంధాలు మెరుగవ్వాలని చెప్పారు. పరిశ్రమ-విద్యా సహకారాన్ని సులభతరం చేయడంలో అమూల్యమైన మద్దతు ఇచ్చినందుకు - వీల్స్ ఇండియా, రాయల్ ఎన్ఫీల్డ్, హెచ్ఎల్ మండో ఆనంద్, ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ సంస్థలకు ఇండస్ట్రీ కనెక్ట్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. వెబ్‌సైట్ డిజైన్ కాంపిటీషన్‌లో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్-భీమునిపట్నం విద్యార్థులు విజయం సాధించి రూ.50 వేల బహుమతిని పొందారు. ఈ సందర్భంగా ఏపిసీటీఈ ప్రగతి, సాక్షం, స్వానత్ స్కాలర్‌షిప్‌ల వివరాలతో కూడిన సమాచార పోస్టర్‌ను సైతం ఆవిష్కరించారు.

## దిగుబడి దిగులు

(మొదటి పేజీ తరువాయి)

మారింది. ఖరీఫ్‌లో మూడునెలలు వేచిచూసి సెప్టెంబరులో వర్షాలు బాగాపడటంతో రైతులు అక్టోబరు, నవంబరులో తుపాన్లు వస్తే పెద్దగా ఇబ్బంది ఉండదని భావించి మిర్చి సాగుకు మొగ్గుచూపారు. కానీ ఇప్పుడు పరిస్థితి తారుమారైంది.

పత్తి సాగు కూడా ఈ ఏడాది కొంత ఆశాజనకంగా ఉంది. పల్నాడు జిల్లాలో 1.53లక్షల ఎకరాల్లో, గుంటూరు జిల్లాలో 40 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ప్రస్తుతం దాదాపు లక్షన్నర ఎకరాల్లో పత్తి పైరు మొదటి తీతలకు సిద్ధంగా ఉంది. పూత, కాయ బాగానే ఉంది. అయితే కాల్వ చివరి భూములు, వర్షాలు చాలా తక్కువ కురిసిన ప్రాంతాల్లో పైరుబెట్టకు వచ్చింది. మొదటి తీతలో 3 నుంచి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. రాబోయే పక్షం రోజుల్లో వర్షం కురవపోతే మెట్ట ప్రాంతంలో పత్తిపైరు బెట్టకు వచ్చి ఎండిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు రూ.40 వేల వరకు పెట్టుబడి పెడుతున్నారు. పత్తి గతేడాది కనిష్టంగా 10 క్వింటాళ్ల దిగుబడి రావడం, ధర కూడా క్వింటాళ్ రూ.6-7 వేలకు కొనుగోలు చేయడం వల్ల రైతులు కొంత మేరకు నష్టాల నుంచి బయటపడ్డారు. ఈ ఏడాది వర్షాభావం వల్ల దిగుబడి, నాణ్యత తగ్గుతుందని చెబుతున్నారు. ప్రధాన పంటలైన వరి, మిర్చి, పత్తి పైర్ల పరిస్థితి ఇలా ఉంటే అపరాల పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40 వేల ఎకరాల్లో సాగు అయిన కంది, 15 వేల ఎకరాల్లో సాగు అయిన మినుము పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదని రైతులు వాపోతున్నారు.

## 15న ప్రజారక్షణభేరి సభ


(మొదటి పేజీ తరువాయి)

సిగ్గుచేటని విమర్శించారు. జిల్లాలో పంటలకు అవసరమైన సాగునీటిని విడుదల చేసి, ఎండిపోతున్న పంటలను కాపాడాలని సమావేశంలో తీర్మానించారు. జిల్లాలో సాగునీటి సమస్య తీవ్రంగా వుందని, కృష్ణా డెల్టాలోని 5.75 లక్షల ఎకరాల భూమి సాగవుతుండగా నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని తెలిపారు. 8 వేల క్యూసెక్కులు నీరు అవసరం కాగా కేవలం 4 వేల క్యూసెక్కులే విడుదల చేస్తున్నారన్నారు. పంటలకు అవసరమైన నీటిని విడుదల చేయాలని తీర్మానంలో పేర్కొన్నారు. జిల్లాలో రోడ్లు, అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపర్చాలని, ప్రభుత్వ భూముల్లో ఇళు వేసుకుని నివాసముంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, పెదవడ్లపూడి హైలెవల్ ఛానల్‌ను పూర్తి చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సమావేశం తీర్మానించింది. సమావేశంలో నాయకులు వై.నేతాజి, ఇ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, కె.నళినీకాంత్, ఎస్ఎస్.చెంగయ్య,బి.వెంకటేశ్వర్లు, డి.వెంకటరెడ్డి, కమలాకర్ పాల్గొన్నారు.

# 'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాశక్తి-కాకుమాను**

ప్రభుత్వం అందరికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుందని, ప్రతి ఒక్కరూ ఈ అవతకాశాన్ని వినియోగించుకోవాలని. ఎస్సీ కార్పొరేషన్ ఇడి టి.ప్రేమ కుమారి తెలిపారు. మండల పరిధిలోని గార్లపాడు మండల పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ శిబిరాన్ని జెడ్పిటిసి



గార్లపాడులో..

గుల్జార్ బేగం సందర్శించారు. రోగులతో మాట్లా డారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురింలచి ప్రజలకు తెలియ జేశారు. ఈ సందర్భంగా పలువురు రోగులు వారి సమస్యలను తెలియజేశారు. ప్రలందరికి అవసరమైన వైద్య పరీ క్షలు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటివద్దకే వచ్చి చేస్తారని, అత్యవసరమైతే హాస్పటల్‌త లకు సిఫారసు చేస్తారని ఆమె తెలిపారు. ప్రజలకు అవసరమైనా అన్ని రకాల మందు లను కూడా శిబిరం వద్ద పంపిణీ చేస్తున్నటు చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను ప్రతి ఒక్కరూ వినిఒయోగించు కోవాలని ఆమె విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో ఎపిపి రామినేని శ్రీనివాసరావు, ఎంపీటీసి పరమేశ్వరరావు, తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ రామకృష్ణ, వైసిపి నాయకులు పెద్ది మురళి,ఎన్ సుబ్బారావు తపాల్గొన్నారు.

**ప్రజాశక్తి-పొన్నూరు రూరల్**

పొన్నూరు మండలం పచ్చలతాటిపర్రులో ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎంపిడిఒ ఎ.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి భవనం పద్మలీల మాట్లాడారు. డాక్టర్ హుస్సేన్, డాక్టర్ శాంతి, డాక్టర్ శ్యామల గౌరీ సంధ్య, డాక్టర్ నాగ సింధూర, ఆప్తమాలజిస్ట్ రత్నకుమారి వైద్య ఆరోగ్య సిబ్బంది ల్యాబ్ టెస్టులు, వైద్య పరీక్షలు నిర్వహించారు. 310 మందికి వైద్య సేవలు, కంటి పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు, కళ్ళజోళ్లను ఎంపిపి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పొన్నూరు తహశీల్దార్ ఎస్ కేదార్నాథ్ శ్రీకాంత్, వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరికల కృష్ణమోహన్, వైసీపీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-తాడేపల్లి**

తాడేపల్లి బైపాస్ రోడ్డు సమీపంలోని నవోదయ కాలనీ సచివాలయంకు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా జెసిఎస్ కన్వీనర్ ఇ.డేవిడ్‌రాజు మాజీ సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, శ్రీనివాసరావు, డాక్టర్ కెవి కిరణ్‌కుమార్; ఆరోగ్య మిత్ర సూర్యనారాయణ, ఎం.ప్రకాష్, బి.అనిల్, బత్తుల దాసు, ఎస్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-నాదెండ్ల**

మండలంలోని గొరిజవోలులో జగనన్న సురక్ష ఆరోగ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి బి.అరుణ మాట్లాడుతూ ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారం ఎలా తయారు చేసుకోవాలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు చిరుధాన్యాలలో ఉండే పోషకాలు, విటమిన్ల గురించి వివరించారు.



తాళ్ళచెరువులో..

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందించే కిట్లను గర్భిణులు, బాలింతలు మాత్రమే వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి టి.రాణి, ఎంఇఒ ఐ.ఆంజనేయులు, సిడిపిఒ శాంత కుమారి, సూపర్‌వైజర్ కె.పద్మ, వైసిపి మండల నాయకులు కోటిరెడ్డి పాల్గొ న్నారు .ట



జమ్మలమడకలో ..

**ప్రజాశక్తి - విజయపురిసౌత్**

మాచర్ల రూరల్ పరిధి అమ్మాని జమ్మలమడక ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, ఎంపీడీవో సరోజినీ దేవి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెడికల్ క్యాంప్ ను సందర్శించి ప్రతి ఒక్క పేద ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు అందించాలని వైద్యులకు ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం (న్యూట్రిషన్) స్టాల్ ను పరిశీలించారు. కార్యక్రమంలో జమ్మలమడక సర్పంచ్ ముక్క గురవమ్మ, లింగపురం సర్పంచ్ వెంకయ్య, ఈవోపిఆర్డి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - అచ్చంపేట**

తాళ్ళచెరువులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యశిబిరంలో పాల్గొన్న జడ్పిటిసి తుమ్మ విజయ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తాళ్ళచెరువులో నిర్వహించిన వైద్యశిబిరంలో సుమారు 600 మందికి పైగా పాల్గొన్నట్లు చెప్పారు. 187 మంది వృద్ధులను పరీక్షించి 172 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారని, బాలింతలు, గర్భిణులను కూడా పరీక్షించినట్లు చెప్పారు. వైద్య సేవలు అందించిన వారిలో డాక్టర్ విన్నారావు, ప్రత్యేక వైద్యులు డాక్టర్ ప్రేమ, డాక్టర్ గిరి రాజుకు కృతజ్ఞతలు తెలి పారు ఎంపిపి బి.రజిని బాయ్, కృష ్ణనాయక్, సర్పంచ్ కె.అన్నమ్మ, వైద్య సిబ్బంది బేబీ, వెం కటరావు, శివమ్మ, రామకోటయ్య పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - రెంటచింతల**

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో పాల్గొని సేవలందించిన డాక్టర్ల సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ దాసరి చౌడేశ్వరి కొనియాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ ప్రదీప్ కుమార్ రెడ్డి,డాక్టర్ హేమలను దుశాలవతో ఘనంగా సత్కరించారు 12 రోజులపాటు నిర్వహించిన వైద్య శిబిరాల్లో 5026 మందికి పరీక్షలు నిర్వహించగా, 110 మంది ఆరోగ్యశ్రీ ఆసు పత్రులకు మెరుగైన చికిత్స కోసం పంపారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఫోన్ లాక్కుపోయిన గుర్తు తెలియనివ్యక్తులు

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్:** బైక్ పై వెనుక కూర్చున్న వ్యక్తి చేతిలో నుంచి మొబైల్ ను ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు లాక్కుపోయిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. మంగళగిరి మండలం ఆత్మకూరు పరిధిలోని గ్రామానికి చెందిన ఎం.శివన్నారాయణ ద్విచక్ర వాహనంపై తన కొడుకుతో కలసి ఇంటికి తిరిగి వస్తున్నాడు. జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్‌ను దాటేందుకు బైక్ స్లో చేశాడు. వారిని అనుసరిస్తూ పల్సర్ బైక్ పై వచ్చిన గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు, వాహనంపై వెనుక కూర్చున్న కొడుకు చేతిలోని మొబైల్‌ను లాక్కొని పారిపోయారు. ఈ మేరకు మంగళగిరి రూరల్ పోలీ సులకు బాధితులు గురువారం ఫిర్యాదు చేశారు.

## జూదరులు అరెస్ట్

**ప్రజాశక్తి-పొన్నూరు రూరల్:** పట్టణంలోని లతీఫ్ చికెన్ స్టాల్ సమీపంలో గురువారం చిట్కా, మట్కా ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద నుండి రూ.700 స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ ఎస్ఐ తెలిపారు.



## మిర్చి నిల్వలు

| | బ్యాగులు |
|---|---|
| మిర్చి దిగుమతి | : 26,510 |
| మిర్చి ఎగుమతి | : 27,401 |
| మిర్చి నిల్వ | : 8,221 |

## మిర్చి ధరలు

| | రూపాయలలో |
|---|---|
| 334 | 10,000 - 23,500 |
| నెం.5 | 12,000 - 22,000 |
| 273 | 15,700 - 15,700 |
| 341 | 10,000 - 20,900 |
| 4884 | 19,000 - 19,000 |
| సూపర్ 10 | 19,000 - 19,000 |
| | నాన్ ఎసి |
| తేజ | 9,500 - 24,000 |
| బడిగి | 10,000 - 26,000 |
| దేవనూరు డీలక్స్ | 23,200 - 23,200 |
| తాలుకాయలు | 6,000 -14,500 |
| | ఎసి |
| 334 | 10,000 - 23,000 |
| నెం.5 | 21,000 - 21,000 |
| 341 | 15,500 - 21,500 |
| 4884 | 10,500 - 19,500 |
| తేజ | 10,500 - 24,000 |
| బడిగి | 16,000 - 25,000 |
| దేవనూరు డీలక్స్ | 17,000 - 20,000 |
| తాలుకాయలు | 6,000 -13,000 |

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE PRL.SENIOR CIVIL JUDGE::GUNTUR**
**I.A. No:720/2022 in O.S.No: 311 /2016**

Between:
Koduru Parinama Lakshmi ...Petitioner/Plaintiff
And
Kallam Peri Reddy and Another ….Respondents/Defendants

**To,**
**R-2/D-2:** Atmakuri Rama Rao, S/o.Venkateswarlu, R/o.Door No:25-16-268, Maharshi Dayananda Nagar, Near Mirchi Yard, A.T.Agraharam, Guntur. (Proposed R2/D2)

పై నెంబరు దావాలోని I.A.No:720/2022 పిటీషనులో ప్రపోజ్డ్ 2వ రెస్పాండెంట్/ ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు Subsituted Service ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరు వేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు ది:31-10-2023న ఉ. గం.10-30 ని.లకు పై తెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది.

( శ్రీ కోర్టు వారి అనుమతితో)
వాయిదా తేది:31-10-2023

**టి.దుర్గా ప్రసాద్,**
**పిటీషనర్/వాది తరపు అడ్వకేట్**
**గుంటూరు.**

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S.No.822 of 2022**

**Between:-**
**Union Bank of India [A Govt. of India undertaking]**
**[Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad,**
**rep.by Its Sr.Managier(Law)&Authorized Officer,Mrs.S.Vijayalakshmi,** **...Plaintiff**
**AND**
**Sri.T.V.Suresh Kumar** **...Defendant**

**To,**
**Sri.T.V .Suresh Kumar, S/o.Venkateswarlu, Aged about 45 Years, Occ:Self Employee, Rjo.D.No.12-697/3, Mahanadu Road No.1, Llne-1B, Tadepalli. Mandal, Guntur-522501**

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.3,29,722-03ps_towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 28-11-2023.
In case of your failure to attend before the Court on 28-11-2023 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

**(BY ORDER OF THE COURT)**
**T.Bhagya Raju**
**& Associate**
**Advocates,**
**Counsel for the Plaintiff.**
**Flat No.402.Nirmal Ratna Aprts**
**Opp:R.S.Brotbers, Chandanagar.**
**Gangaram Village, HYDERABAD-50**

**IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S.No.1044 of 2021**

**Between:-**
**Union Bank of India [A Govt. of India undertaking]**
**[Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad,**
**rep.by Its Sr.Managier(Law) &Authorized Officer,**
**Mrs.S. Vijayalakshmi,** **...Plaintiff**
**AND**
**Sri.V.Venkateswara Rao** **...Defendant**

To,
**Sri.V.Venkateswara Rao, S/o.V.Ranga Rao, Aged about 40 years, Occ: Business, R/o.# 21-32, Vijaybhaskar Nagar, Pedakani (Mandal), Namburu (Post), Guntur District, A.P-522508.**

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,12,020-17ps_towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 07-11-2023.
In case of your failure to attend before the Court on 07-11-2023 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

**(BY ORDER OF THE COURT)**
**T.Bhagya Raju**
**& Associate**
**Advocates,**
**Counsel for the Plaintiff.**
**Flat No.402.Nirmal Ratna Aprts**
**Opp:R.S.Brotbers, Chandanagar.**
**Gangaram Village, HYDERABAD-50**

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలంగా నా క్లయింటు అయిన పల్నాడుజిల్లా, సత్తెనపల్లి మండలం, సత్తెనపల్లి పట్టణానికి చెందిన ది. గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు, సత్తెనపల్లి బ్రాంచి రిప్రజెంటెడ్ బై బ్రాంచి మేనేజర్ నుండి సమాచారం పొంది ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా :

ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి పఠాన్ మహబూబ్ షరీఫ్, తండ్రి ఆదంషఫీ గారిదనిన్నీ, సదరు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి పఠాన్ మహబూబ్ షరీఫ్ గారు ది. 29-4-2004వ తేదీన షేక్ శిలార్, తండ్రి బుడే సాహెబ్ వలన విక్రయం పొంది సదరు స్థిరాస్తిని సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు దస్తావేజు నెంబర్ 1079/2004గా రిజిస్టర్ కాబడినదనిన్న, సదరు షేక్ శిలార్, తండ్రి బుడేసాహెబ్ మరియు షేక్ మాలీంబి, భర్త శిలార్ ఇరువురు జాయింటు కలిపి ది. 12-09-1997వ తేదీన షేక్ అబ్దుల్ మజీద్, తండ్రి అబ్దుల్ అల్లామ్ గారి నుండి కొనుగోలు చేసి సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నందు దస్తావేజు నెంబర్ 2449/1997గా రిజిస్టర్ కాబడినదనిన్నీ, అనంతరం సదరు షేక్ మాలీంబీ చనిపోయినారనిన్నీ, సదరు షేక్ మాలీంబికి ముఖ్య వారసులు షేక్ శిలార్ గారు మాత్రమేనని, మాలీంబి గారి అనంతరం స్థిరచరాస్తులు అన్ని షేక్ శిలార్ గారు మాత్రమే అనుభవించుచున్నారనిన్నీ, అనంతరం షేక్ శిలార్ గారు ఒక్కరే పఠాన్ మహబూబ్ షరీఫ్ గారికి అమ్మియున్నారనిన్నీ, అనంతరం పఠాన్ మహబూబ్ షరీఫ్ గారు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని స్వాధీన పరచుకొని ఎటువంటి ఆటంకం లేకుండా అనుభవిస్తున్నారనిన్నీ, సదరు పఠాన్ మహబూబ్ షరీఫ్ గారు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తి మీద లోన్ కావాలని నా క్లయింట్ అయిన బ్యాంకును కలిసి అడుగగా, అందుకు నా క్లయింటు అయిన బ్యాంకు సదరు పఠాన్ మహబూబ్ షరీఫ్ గారికి సంబంధించిన ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తికి లోన్ పత్రాలు తయారు చేయుటకు ముందు ఈ దిగువ షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైన ఎటువంటి అభ్యంతరాలు గాని, ఏమైనా క్లెయిమ్‌లుగానీ ఉన్న యెడల నా క్లయింటు అయిన బ్యాంకుకు గానీ, లేదా నాకు గానీ 07 (ఏడు) రోజులలోపు స్వయంగా గానీ, లేక న్యాయవాది ద్వారా గానీ తెలియజేయవలసినదిగా తెలియపరచడమైనది. లేనిచో ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిపై ఎటువంటి అభ్యంతరాలు లేవని నిర్ణయించి, సదరు ఆస్తి నిష్కేక్షితమైనదిగా భావించి దరు పఠాన్ మహబూబ్ షరీఫ్ గారికి నా క్లయింటు లోన్ ఇవ్వబడుననీ ఇందుమూలముగా తెలియపరచడమైనది.

**Description of the Schedule Property**

Palnadu District - Narasaraopet Registration District - Sattenapalli Sub- registrar office - Sattenapalli Municipal Area limits - Sattenapalli Mandal- Sattenapalli Grama D.No. 182- which is an extent of Ac.146 Sq.yards or 122.64 Sq. meters vacant site bounded by :
East : House Belongs to Shaik Moulali of 92 Links
South : Bazaar of 32.75 Links
West : site Belongs to Mahammad Abdul Majeed of 92 Links
North : Site Belongs to Syed China Mahaboob of 32.75 Links
within the above boundaries an extent of Ac.146 Sq.yards of 122.64 Sq.meters vacant site.
Dt. 19-10-2023

**నల్లిబోయిన ఆంజనేయులు,**
**న్యాయవాది,**
**సత్తెనపల్లి, పల్నాడుజిల్లా.**



జలవనరుల కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

## సాగు నీటి కోసం ఎండిన పైరుతో ధర్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

నాగార్జున సాగర్ ఆయకట్టుకు సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు టిడిపి, జనసేన, సిపిఐ నాయకులు స్థానిక జలవనరుల శాఖ కార్యాలయం ఎదుట గురువారం మిర్చి, పత్తి మొక్కలతో ధర్నా చేశారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాల్వ చివరి భూములకు సాగునీరు అందించాలన్నారు. రైతుల గురించి జలవనరుల శాఖ మంత్రి మంత్రి అంబటి రాంబాబు పట్టించుకోవటం లేదని విమర్శించారు. అనంతరం ఈఈ మురళీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నా నేపథ్యంలో కార్యాలయం వద్ద పోలీసులు మోహరించారు. ధర్నాలో బి.వెంకట అప్పారావు, ఎన్.వేణుగోపాల్, జె.విజయ్ కుమార్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



డాక్టర్ అనూషను సత్కరిస్తున్న రామకృష్ణ, తదితరులు

## నూతన వైద్యురాలికి సత్కారంతో ఆహ్వానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి ఏరియా హాస్పిటల్‌కు ఎంసిడి మెడికల్ ఆఫీసర్‌గా నూతనంగా నియమితులైన కుప్పలా అనూషను హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన వైద్యులను సత్కారం ద్వారా ఆహ్వానించడాన్ని సంప్రదాయంగా పెట్టుకున్నామని చెప్పారు. ఆస్పత్రికి ఎక్కువగా పేదలే వస్తారని, వారికి సేవా భావంతో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక చొరవతో ఆస్పత్రి జిల్లాలోనే మొదటి స్థానానికి చేరిందని చెప్పారు. హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ లక్ష్మణరావు మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా వైద్యం అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఒ శోభరాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, మెడికల్ సూపర్వైజర్ విజయలక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

## చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు : డీఎస్పీ



**ప్రజాశక్తి-సత్తెనపల్లి :** దసరా సెలవుల నేపథ్యంలో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ చెప్పారు. ఈ మేరకు తన కార్యాలయంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. సెలవుల సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు.

## 22న ఉచిత కంటి వైద్యశిబిరం

**ప్రజాశక్తి - రెంటచింతల :** మండల కేంద్రమైన రెంటచింతలలోనే వైఆర్ఎస్ హైస్కూల్లో ఈనెల 22న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శంకర కంటి ఆసుపత్రి, రూరల్ హోప్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించే శిబిరంలో కంటి శుక్లాలకు సంబంధించి ఆపరేషన్లు చేస్తారని, శిబిరానికి వచ్చేవారు రేషన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డుతో రావాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ సమీపంలోనే గుండా జనార్దన్ సెల్ పాయింట్‌లో సంప్రదించాలన్నారు.

# పొలం బీటలు - నీటి కోసం 3 వేల అడుగుల పైపులు

- ఎండిపోతున్న వరి, మిర్చి పైర్లు
- బతికించుకునేందుకు తంటాలు పడుతున్న రైతులు
- పరిహారం కోసం పోరుయాత్ర బృందం డిమాండ్
- వివిధ రకాల భూములను సాగు చేస్తున్న రైతులకే పట్టాలివ్వాలన్న నాయకులు
- 'ఆసరా' నగదు జమవ్వలేదని మహిళల ఆవేదన



కందులవారిపాలెంలో బీటలువారిన వరిపొలాలను పరిశీలిస్తున్న పోరుయాత్ర బృందం



ముప్పాళ్ల మండలంలో పారిశుధ్యం సరిగా లేకపోవడాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పొట్ట దశలో ఉన్న వరిపైరుకు నీరు లేక నేల బీటలు వారగా... మిర్చి పైరును కాపాడుకోవడానికి 3 వేల అడుగుల దూరం నుండి పైపులతో నీరు పెట్టుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు. అయినా పంట చేతికి దక్కే సూచనలు లేక తల్లడిల్లుతున్నారు. సిపిఎం చేపట్టిన పోరుయాత్ర కార్యక్రమంలో మండలంలోని కందులవారిపాలెంలో గురువారం పర్యటించింది. బగ్గి వెంకయ్య, పసుపులేటి మల్లారెడ్డి తదితరులకు చెందిన దెబ్బతిన్న పైర్లను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ పైర్లు ఎండిపోతున్నా, రైతులు నానా అగచాట్లు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంకయ్యకు చెందిన రెండెకరాలు, మల్లారెడ్డికి చెందిన 8 ఎకరాలు వరిపంట నీరు లేక పొట్ట దశలో పూర్తిగా ఎండిపోయిందని చెప్పారు. ఇప్పటికే ఆ రైతులు ఎకరాలకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టారని, వ్యవసాయ శాఖాధికారులు ఈ పొలాలను చూసి వెళ్లినా నష్టపరిమారం మాత్రం ప్రకటించలేదని అన్నారు. ఎకరాకు రూ.25 వేల చొప్పున పరిహారం ప్రకటించి బాధిత రైతులను ప్రభుత్వం సత్వరం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిగతా పైర్లను కాపాడుకోవడానికి రైతులు నీరు పెట్టుకోవడానికి చేస్తున్న ఖర్చునూ ఇవ్వాలన్నారు. మిర్చి పంటను కాపాడుకునేందుకు మూడువేల అడుగుల దూరం నుండి పైపులు వేసి నీటిని పెట్టుకుంటున్నారని, పైపులకు, కూలీలకు కలిపి సుమారు రూ.30 వేలు ఖర్చవుతోందని తెలిపారు.

జగనన్న భూరక్షలో భూ సమస్యలను ఏవీ పరిష్కారం చేయడం లేదని, కేవలం పట్టాదారు పాస్ పుస్తకాలను మార్పు చేసి సిఎం బొమ్మలతో కొత్తవాటినే ఇస్తున్నారని అన్నారు. భూ సమస్యలన్నింటినీ పరిష్కరించి అన్ని రకాల భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగనన్న జల పథకం కింద ఉచితంగా బోర్లు వేస్తామని చెప్పినా వాస్తవంలో మాత్రం రైతులే స్వయంగా ఖర్చు పెట్టి బోర్లు వేయించుకోవడం, బావులు తీసుకోవడం జరుగుతోందని, కనీసం ఆ ఖర్చులనైనా రైతులకు ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా ఆసరా పథకం కింద తమకింకా డబ్బులు జమ చేయలేదని పలువురు మహిళలు పోరుయాత్ర బృందానికి వివరించారు.

సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 98 హామీలను అమలు చేశామని చెబుతున్నా వాస్తవానికి 60 శాతానికి కూడా మించలేదని, సాంకేతిక సమస్య సాకుతో సంక్షేమ పథకాలను దూరం చేస్తున్నారని విమర్శించారు. నీరు లేక రైతులు, పనుల్లేక కూలీలు అల్లాడుతున్నారని, ఇప్పటికే ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న జనంపై విద్యుత్ ఛార్జీల భారాన్ని రాష్ట్ర మోపడం దుర్మార్గమని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించని కారణంగా మురుగు కూపాలుగా దర్శనమిస్తున్నాయని, సబ్‌ప్లాన్ నిధులు ఎమయ్యాయో అర్థం కావడం లేదని నిలదీశారు. కార్యక్రమంలో నాయకులు సిహెచ్.లక్ష్మీనారాయణ, ఆర్.పూర్ణచంద్రరావు, వి.తులసీరామ్, బి.రామారావు, డి.మేరమ్మ, జై భగత్, వెంకటేశ్వర్లు, ఎం.శివరాం, సత్యవతి, అనూష, సుజాత, అమూల్య, కె.సాయికుమార్ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-ముప్పాళ్ల**

మండలంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న సిపిఎం పోరుయాత్ర బుధవారం పలుదేవర్లపాడు, నార్నెపాడు గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడుతూ సాగర్ ఆయకట్టులో రైతుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందనీ, రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ముప్పాళ్ల మండలాన్ని కరువు మండలంగా గుర్తించాలన్నారు. విద్యుత్ వినియోగించకున్నా బిల్లులు వసూలు వేస్తున్నారని, తక్షణమే ఆ చర్యను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.జాలయ్య, కె.సాంబశివరావు, కె.ప్రభాకర్, ఎన్.సాంబశివరావు, ఐ.లింగయ్య, శ్రీను, ఎం.వెంకటరెడ్డి, కె.నాగేశ్వరరావు, పి.సైదాఖాన్, సిహెచ్. నాగమల్లేశ్వరరావు, ఐ.సత్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, టి.బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# యజమాని దూషించాడని డ్రైవర్ల నిరసన

## పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోలో కొన్ని గంటలపాటు నిలిచిన హైర్ బస్సులు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల



తమపై ఆర్టీసీ హైర్ బస్సుల యాజమాన్యం అసభ్య పదజాలంతో దూషించారని పిడుగురాళ్ల ఆర్టీసీ హైర్ బస్సుల డ్రైవర్లు గురువారం వాహనాలను నిలిపేసి ఆందోళన చేపట్టారు. వివరాల ప్రకారం.. హైర్ బస్సు డ్రైవర్ రవినాయక్‌ను తప్పేమీ లేకుండానే యజమాని అసభ్య పదజాలంతో దుర్భషలాడారని, తమను చిన్నచూపు చూస్తున్నారని పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోకు చెందిన 18 మంది హైర్ బస్ డ్రైవర్లు బస్సులు నిలిపేసి నిరసన తెలిపారు. పేరుకు ఆర్టీసీ సంస్థలో పని చేస్తున్నామని చెప్పుకోవటమే తప్ప తమ ఉద్యోగానికి, జీవితాలకు రక్షణేమీ లేదని, అరకొర జీతంతో యాజమాన్యాల సూటిపోటి మాటలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వెలిబుచ్చారు. తమకు కనీస సౌకర్యాలు కూడా లేవన్నారు. ఆర్టీసీలో పని చేస్తున్నా తమ ఇంటి నుండి డిపో వద్దకు రావాలన్నా బస్సు టికెట్ కొనాల్సిందేనని, తమకు ప్రమాదం వాటిల్లినా తమ కుటుంబాలకు భరోసా ఏమీ లేదని వాపోయారు. ప్రయాణంలో ఏదైనా చిన్నపాటి ప్రమాదాలు జరిగి ఎదుటి వాహనాలకు నష్టం జరిగితే తమ సొంత డబ్బులు ఖర్చు పెట్టుకోవాల్సిందేనని వివరించారు. తమను అకారణంగా దూషించిన యాజమాన్యం క్షమాపణలు చెప్పేంత వరకు బస్సులు నడపబోమన్నారు.

ఇదిలా ఉండగా దసరా సీజన్ కావడంతో బస్సులు నిలిపివేయడంతో ప్రయాణికులు బస్సు సౌకర్యాల్లేక ఇబ్బందులకు గురయ్యారు. ఘటనపై డిపో మేనేజర్ మాట్లాడుతూ డ్రైవర్లకు, యాజమాన్యాలకు వివాదాలేమైనా ఉంటే మాట్లాడుకుని పరిష్కరించుకోవాలేగాని ఇలా సర్వీసులు నిలిపేయడం సరికాదని చెప్పారు. స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పిడుగురాళ్ల డిపో మొత్తంగా 53 సర్వీసులు ఉండగా 35 ప్రభుత్వం బస్సులు కాగా 18 హైర్ బస్సులు ఉన్నాయి. వీటిల్లో వివాదం తలెత్తిన యజమాని బస్సులు 5 ఉన్నాయి. మిగతా హైర్ బస్సులన్నీ 11 గంటలకు ప్రయాణానికి వెళ్లాయి. నిలిచిన ఐదు బస్సులకూ ఇతర డిపోల డ్రైవర్లను పిలిపించి మధ్యాహ్నం నుండి పునరుద్ధరించారు.

# పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలి

## గుంటూరులో కొవ్వొత్తులతో ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని, పాలస్తీనా భూభాగంపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ గుంటూరు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక శంకర్‌విలాస్ సెంటర్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య వయిదేళ్ల నాటి నుండి ఉన్న సమస్యను పరిష్కరించకుండా, సామ్రాజ్యవాద దేశాలు వారి దోపిడికీ ఉపయోగించుకుంటున్నాయన్నారు. పాలస్తీనాపై భీకరమైన దాడులు ఇజ్రాయిల్ చేస్తుందని, వారికి నీరు, ఆహారం, మందులు లేవన్నారు. వెంటనే




ఈదాడులన్నింటినీ నిలిపివేసి, శాంతి ప్రక్రియ చేపట్టాలని కోరారు. బ్రిటీషు కాలం నుండి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న జాతిగా భారతీయులందరూ పాలస్తీనీయులకు సంఘీభావంగా ఉండాలని, స్వతంత్ర పాలస్తీనా సమాజం ఏర్పాడాలన్నారు. అంతర్జాతీయ సమాజం మొత్తం ఈ దాడులను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో కె.నళినీకాంత్, వెంకట్రావు, సలీం, కంచుమాటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ డిఎలు చెల్లించాలి

**ప్రజాశక్తి-గుంటూరు** :రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌భాషా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దసరా పండుగకైనా డిఎ బకాయిలను తక్షణమే విడుదల చేసి ఉద్యోగులకు పండుగ కానుక ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కూడా దసరా కానుకగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4శాతం డిఏని విడుదల చేసిందని గుర్తు చేశారు. కావున రాష్ట్ర ప్రభుత్వం కూడా పెండింగ్ ఎడిఎలు విడుదల చేయాలన్నారు.


కార్డులు అందజేస్తున్న మేయర్

## కార్మికులకు ఇఎస్ఐ కార్డులు అందజేత

**ప్రజాశక్తి-గుంటూరు** :గుంటూరు విధులు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు నగర మేయర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఈఎస్ఐ కార్డులు అందచేశారు. ఇటీవల జిఎంసి పరిధిలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ పోర్టల్‌లో ఆధార్ అప్‌డేషన్ క్యాంప్ నిర్వహించిన విషయం విదితమే. క్యాంపులో కొందరికి కార్డులు అందలేదని తెలియచేయటంతో మేయర్ ఔట్‌సోర్సింగ్‌కు కార్పొరేషన్‌తో మాట్లాడి అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి కార్మికుడు ఈఎస్ఐ వైద్యసేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అందుగుల సంతోష్, వైసిపి నాయకులు సాదు రాజేష్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నాయకులు మధుబాబు పాల్గొన్నారు.

# గ్రావెల్‌ను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనుల్లో గ్రావెల్ కోసం జారీ చేస్తున్న టోకెన్లను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలుంటాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో జిఎంసి ఇంజినీరింగ్, హౌసింగ్, మైనింగ్ శాఖ అధికారులు, ఎమినిటి కార్యదర్శులతో జగనన్నకాలనీల్లో ఇళ్ళ నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత లే అవుట్స్ వారిగా ఇళ్ళ నిర్మాణం పురోగతి, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణపనులు వేగంగా జరిగేందుకు ఇప్పటివరకు గ్రావెల్ సమస్యగా ఉందని, జిల్లా కలెక్టర్ చొరవతో గ్రావెల్ కొరత లేకుండా లే అవుట్స్‌కు టోకెన్స్ ద్వారా సరఫరా జరుగుతుందన్నారు. గ్రావెల్ టోకెన్స్ హౌసింగ్ ఏ.ఈ.ల ద్వారా లే అవుట్స్‌లో ఇళ్ళ నిర్మాణ కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లకు ఇళ్ళ సంఖ్యకు అనుగుణంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. నోడల్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు సదరు టోకెన్ల ద్వారా వచ్చే గ్రావెల్‌ను కాంట్రాక్టర్లు జగనన్న లే అవుట్స్ లోనే వినియోగించేలా చూడాలని, దుర్వినియోగం చేస్తే వెంటనే తమ దృష్టికి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

తీసుకొస్తే వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లకు రోజువారీ జారీ చేసే టోకెన్ల వివరాలను హౌసింగ్ అధికారులు ప్రతి రోజు హౌసింగ్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని ఆదేశించారు. అలాగే ఇసుక, సిమెంట్, ఇనుము సమస్యల పరిష్కారానికి అధి. కారులు, ప్రభుత్వం వైపు నుండి సంపూర్ణ చర్యలు తీసుకుంటున్నందున నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకొని, పనుల వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆర్.డి.ఓ. ప్రభాకరరెడ్డి, మైనింగ్ డి.డి. సుబ్రమణ్యేశ్వరరావు, జిఎంసి డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, వెంకటకృష్ణయ్య, ఎస్.ఈ. భాస్కర్, ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, శ్రీనివాస్, హౌసింగ్ ఈ.ఈ. శంకరరావు పాల్గొన్నారు.

## సురక్ష క్యాంపులను ఉపయోగించుకోవాలి

**ప్రజాశక్తి-గుంటూరు:**దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కషి చేస్తున్నారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. గురువారం గుంటూరు నగరంలోని నెహ్రూ నగర్ 7 వ లైన్ నందు గల నగర పాలక సంస్థ ప్రాథమిక పాటశాల వద్ద ఏర్పాటు చేసిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపును మేయర్ సందర్శించారు. నగర ప్రజలు ఈ క్యాంపులను వినియోగించుకొని, వైద్యసేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అయిశెట్టి కనకదుర్గ, అందుగుల సంతోష్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## నృత్యకారిణులకు కుమార్‌పంప్స్ సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణానికి చెందిన ప్రఖ్యాత నృత్యకారిణులను కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సత్కరించనున్నారు. తహసిన్, గ్రీష్మశ్రీ ఇరువురు నృత్యకారిణిలు ఇటీవల హరియాణ, కర్నాటక గవర్నర్ల సమక్షంలో నృత్య ప్రదర్శన చేసి ప్రశంసలు పొందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారిని కుమార్ పంప్స్ అండ్ మోటార్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ సమావేశ హాలులో సత్కరిస్తున్నట్లు కోఆర్డినేటర్ దిలీప్ రాజా గురువారం తెలిపారు.

## అకడమిక్ సెనేట్‌లో పలు అంశాలపై సమీక్ష

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గురువారం 88వ అకడమిక్ సెనేట్ ప్రత్యేక సమావేశం జరిగింది. డైక్ మన్ ఆడిటోరియంలోని బాలమోహన్ దాస్ సెమినార్ హాల్లో జరిగిన ఈ సమావేశానికి విసి ప్రొఫెసర్ పి. రాజశేఖర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. అకాడమిక్ సెనేట్ అనేది వర్సిటీకి అత్యున్నతమైన వ్యవస్థ అని దీనిలో విద్య విషయక అంశాలను చర్చిస్తారన్నారు. బుధవారం నిర్వహించిన వర్సిటీ పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సెనేట్ ఆమోదించేందుకు ఈ సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్య మండలి ఆదేశాల మేరకు ఈ సమావేశంలో పలు కీలక అంశాలను చర్చించి ఆమోదించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీలకు కేటాయించిన పలు జీవోలను అడాప్ట్ చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ, డీన్లు, ప్రిన్సిపాల్స్ , సెనేట్ సభ్యులు, పాలకమండలి సభ్యులు, పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.

## నేడు అమరారెడ్డి 42వ వర్ధంతి సభ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మాజీ సర్పంచ్, ఉద్యమ నాయకుడు మేకా అమరారెడ్డి 42వ వర్ధంతి సభ శుక్రవారం సాయంత్రం తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయం సమీపంలో నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి పాశం రామారావు స్థానిక నాయకులు పాల్గొంటారని చెప్పారు. తాడేపల్లి ప్రాంతంలో సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా అమరారెడ్డి ఎనలేని కృషి చేశారని, కుంచనపల్లిలో దళితులకు అండగా నిలబడ్డారని పేర్కొన్నారు. సిపిఎం నాయకునిగా ప్రజల కోసం కృషి చేస్తున్న ఆయన్ను ఓర్వలేని కొంత మంది అసాంఘిక శక్తులు 1981లో దారుణంగా హత్య చేశారని, అప్పటి నుంచి క్రమం తప్పకుండా అమరారెడ్డి వర్ధంతి సభను సిపిఎం ఆధ్వర్యంలో తాడేపల్లిలో జరుపుతున్నామని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం నేడు జరగనున్న వర్ధంతి సభలో సిపిఎం సభ్యులు, సాను భూతిపరులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



## ఎండుతున్న పంటలను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - తెనాలి

సాగునీరు అందక దెబ్బతిన్న వరి పొలాలను గురువారం వ్యవసాయ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. ఈస్ట్ ఛానల్ పరిధిలోని రూరల్ గ్రామాలైన కొలకలూరు, కాజీపేట, హాఫ్ పేట గ్రామాలలో పర్యటించిన ఇరిగేషన్ ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వర్లు వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం వరికి నీరు ఎంతో అవసరమని, సాగునీటి విడుదలకు ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎస్‌ఈ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యలన్నిటినీ పరిశీలిస్తున్నామని, సాగునీటి విడుదలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే రైతులు సమన్వయంతో వ్యవహరించి, దిగువ ప్రాంతాలకు కూడా నీరు అందేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి ప్రేమ్ సాగర్ ,ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

# నేటి నుంచి వీణా అవార్డ్స్ పద్య, సాంఘిక నాటిక పోటీలు

## నెమలికంటి తారకరామారావుకు ఎఆర్ కృష్ణ జాతీయ పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి-తెనాలి

దసరా ఉత్సవాల సందర్భంగా పద్యనాటక, సాంఘిక నాటిక పోటీలు ప్రేక్షకులను ఐదు రోజులపాటు అలరించనున్నాయి. పట్టణానికి చెందిన కళల కాణాచి, విజయవాడకు చెందిన వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్న నాటక, నాటిక పోటీల వివరాలను గురువారం ఆయా సంస్థల బృందం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా కళల కాణాచి సంస్థ అధ్యక్షులు, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లడుతూ జాతీయ స్థాయిలో తృతీయ వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు ఈనెల 20 నుంచి 24 వరకూ స్తానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 35పద్యనాటికలు, 40 సాంఘిక నాటకల ఎంట్రీలు రాగా, వాటిలో పద్యనాటికలు ఏడు, సాంఘిక నాటికలు ఏడు ఎంపిక చేశామన్నారు. ప్రతిరోజు ఉదయం, మద్యాహ్నం రెండు గంటలకు పద్యనాటికపోటీలు, సాయంత్రం సాంఘిక నాటిక ప్రదర్శనలుంటాయన్నారు. మరో నాలుగు సాంఘిక నాటకాలు కూడా ప్రదర్శించనున్నట్లు చెప్పారు. పోటీల ప్రారంభోత్సవ సభలో ఏఆర్ కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాన్ని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రంగస్థల నటులు నెమలికంటి తారక రామారావుకు అందిస్తున్నట్లు చెప్పారు. 24న నాటిక పోటీలు ముగింపు సభలో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని నెల్లూరుకు చెందిన ప్రముఖ పౌరాణిక నటులు పొన్నాల సుబ్బారెడ్డికి ప్రధానం చేస్తారన్నారు. ఆయా పురస్కార ప్రధానోత్సవాల్లో సినీ హీరో అశోక్ గల్లా, హీరోయిన్ మానస వారణాసి, సినీ దర్శకులు వంశీ, నటులు ప్రదీప్, విస్సు పాల్గొంటారన్నారు.



నాటకోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కళలకాణాచి, వేదగంగోత్రి ఫౌండేషన్ బృందం

సమావేశంలో కళల కాణాచి ప్రధాన కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, కోశాధికారి డి.భవాని, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానిభాషా, సహాయ కార్యదర్శులు ఐనాల మల్లేశ్వర రావు, కొండముది రమేష్, పిఆర్వో షేక్ అబ్దుల్ హకీంజాని, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, వి.నారాయణ శివప్రసాద్ పాల్గొన్నారు.

**నేటి ప్రదర్శనలు**


నాటిక పోటీల ప్రదర్శలలో తొలిరోజున ఉదయం పదిన్నరకు హైదరాబాద్ కళానికేతన్ వారి వసంతరాజీయం, మద్యాహ్నం రెండు గంటలకు చెరుకుపల్లి ఉషోదయ నాట్యమండలి వారి మోహిని భస్మాసుర పద్యనాటికలు, సాయంత్రం ఐదు గంటలకు చిత్ర క్రియేషన్స్ హైదరాబాద్ వారి ఇంపోస్టర్స్, రాత్రి 8.15కు కరీంనగర్ చైతన్య కళాభారతి వారి స్వప్నం రాల్చిన అమృతం సాంఘిక నాటికలు ప్రదర్శిస్తారు.




## మండలం అభివృద్ధికి కృషి చేయండి

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కృషి చేయాలని పెదకూరపాడు ఎంపిపి బెల్లంకొండ మీరయ్య కోరారు. గురువారం పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో పెదకూరపాడు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిధులను సద్వినియోగం చేయాలని కోరారు. అధికారులు తమ శాఖల నివేదికలను వివరించారు. కార్యక్రమంలో ఎండిఒ నరసింహారావు, తహసిల్దార్ జియా, జడ్పిటిసి స్వర్ణకుమారి, వైస్ ఎంపిపి బాషా పాల్గొన్నారు.



## 29న సింహగర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మాచర్ల

నూర్‌బాషా దూదేకుల వర్గాలను అన్ని రాజకీయ పార్టీలు గౌరవించి చట్టసభలలో, అధికారంలో భాగస్వామ్యం చేయాలని పల్నాడు జిల్లా నూర్‌బాషా దూదేకుల సంఘ అధ్యక్షులు సయ్యద్ మస్తాన్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బాదన్‌బాయ్‌లు డిమాండ్ చేశారు. ఈ నెల 29న గుంటూరులోని పొన్నూరు రోడ్డులో ఉన్న ఆంధ్ర ముస్లిమ్ కళాశాల ఆవరణలో జరిగే దూదేకుల సింహగర్జన సభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ జనాభా ప్రాతి పదికన అన్ని రాజకీయ పార్టీల నాయకత్వం తమను గుర్తించి చట్ట సభలలో, అధికారంలో భాగస్వామ్యం కల్పిం చాలన్నారు. తమను విస్మరించిన పార్టీలను ఓడించేందుకు తాము వెనకాడబోమని హెచ్చరించారు.



## ఎన్‌సిసి శిక్షణా శిబిరంలో సత్తా చాటిన నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు


ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

23వ ఆంధ్ర ఎన్.సి.సి బెటాలియన్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుండి బాపట్ల జిల్లా చీరాలలో జరుగుతున్న ఎన్.సి.సి శిక్షణా శిబిరంలో నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తాచాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎం.శ్రీనివాసకుమార్ గురువారం తెలిపారు.ఈ మేరకు శిక్షణా శిబిరం ఆఖరి రోజు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 23వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సునీల్ గౌతమ్ చేతుల మీదుగా మెడల్స్ బహూకరించారు. పురుషుల విభాగంలో ఎం.జస్వంత్, బి.యువరాజు,డి. వి హరీష్ మెడల్స్ సాధించగా,మహిళల విభాగంలో ఐ.శతి, జి.చిన్మయి, బి.వి రాణిలు మెడల్స్ సాధించారు. వీరితో పాటు మీరా జాస్మిన్,కావ్య లు ఉత్తమ ప్రతిభ కనపరచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు.మెడల్స్ సాధించిన విద్యార్థులను కళాశాల యాజమన్యం ,ఎన్.సి.సి అధికారి రాజేష్ బాబు, అధ్యాపక, అద్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

# తక్కువ వడ్డీకే వ్యవసాయ రుణాలు

ప్రజాశక్తి-ఈపూరు

ష్యూరిటీ లేకుండా రైతులకు తక్కువ వడ్డీకే మూడు లక్షల వరకు వ్యవసాయ రుణాలు అందజేస్తున్నామని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన ఈపూరులోని నూతన భవనంలో సిజిజి బ్యాంక్ ను గురు వారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి బ్యాంక్ చైర్మన్ కామేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కామేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, జిల్లాలలో 28 లక్షల మంది ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామన్నారు. రైతులు,మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తూ అత్య ధికంగా రుణాలు మంజూరు చేశామని, తమకు 22 లక్షల మంది డిపాజిట్ దారులు ఉన్నట్లు చెప్పారు. ఆరు లక్షల మంది రైతులకు వ్యవసాయ రుణాలు అందించామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.13 వేల కోట్లు వ్యాపార లావా దేవీలు జరుగుతున్నాయని,1. 25 లక్షల మంది రైతులకు రూ.1800 కోట్ల వ్యవసాయ రుణాలు, 48 వేల డ్వాక్రా గ్రూపు లకు రూ. 3,300 కోట్లు రుణాలు అందించినట్లు వివరించారు. అలాగే తక్కువ వడ్డీకే వ్యవసాయ బంగారం రుణాలను 3.85 లక్షల మంది రైతులకు రూ.4,400 కోట్లు , ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులకు రూ.100 కోట్లు వరకు రుణాలు మంజూరు చేశామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. చిన్న పరిశ్రమల స్థాపన వైపు మొగ్గు చూపే వారికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన బ్యాంకు సేవలు అందించాలనే లక్ష్యంతో చైతన్య గోదా వరి గ్రామీణ బ్యాంక్ కార్యకలాపాలు ప్రారంభించిందని, ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సిహెచ్ శ్రీనివాసరావు,విజిలెన్స్ అధికారులు, ఇ.రాంబాబు,ఎన్ వి.విజయ్ కుమార్, జడ్పిటిసి తుర్లపాటి చౌడయ్య, సర్పంచ్ పి.చెంచయ్య, బ్యాంక్ మేనేజర్ డి.రాజేష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రమేష్,సీజీజీ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు జ్ఞాపికను అందజేస్తున్న సిజిజి బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు

## గుత్తికొండలో ప్రతి ఇంటికీ తాగునీరందిస్తాం

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

తెలుగుదేశం పార్టీ హయాంలో గుత్తికొండకి మూడు కోట్ల రూపాయల కేటాయించిందని, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గ్రామాభివృద్ధికి రూ.51 కోట్లతో అభివృద్ధి చేశామని గురజాల శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుత్తికొండలో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేశామని అన్నారు. త్వరలో గుత్తికొండలో ప్రతి ఇంటికి తాగునీటిని అందిస్తామని, పూర్తి చేయాల్సిన రహదారులను కూడా పూర్తి చేస్తామని చెప్పారు. నియోజకవర్గంలోని గ్రామాలన్నింటిని గత ప్రభుత్వం కంటే మెరుగ్గా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. రాజకీయాలలో గెలుపు ఓటములు సహజమేనని కానీ ప్రజలు ఇచ్చిన అధికారాన్ని దుర్వినియోగం చేయకుండా గ్రామాల అభివృద్ధికి, సంక్షేమ పథకాలు అందజేసేందుకు మాత్రమే వినియోగించుకోవాలని అన్నారు. కార్య క్రమంలో తహశీల్దార్ చక్రవర్తి, ఎంపిడిఒ కాశయ్య,మాజీ జెడ్పిటిసి సభ్యులు వీరభద్రులు పాల్గొన్నారు.


గుత్తికొండలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి



## చిన్నారులకు అండగా ఉంటా ఎమ్మెల్యే శంకరరావు

ప్రజాశక్తి - అచ్చంపేట

రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు తాను అండగా ఉంటానని స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రెండు లక్షల రూపాయల చెక్కును చిన్నారుల కుటుంబ సభ్యులకు గురువారం ఆయన అందజేశారు. మండలం పరిధిలోని గ్రంథసిరికి చెందిన చిలకా సునీల్, మరియ కుమారి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారికి ముగ్గురు పిల్లలు. తల్లిదండ్రులు చనిపోవడంతో ఆ చిన్నారులు వారి తాతయ్య, నాయనమ్మ దగ్గరకు చేరారు. కానీ వాళ్లు కూడా ముసలివాళ్లు కావడంతో పోషణ కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, సిఎంఆర్‌ఎఫ్ ద్వారా వచ్చిన రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆ కుటుంబానికి అండగా ఉంటానని, ఎప్పుడు ఏ అవ సరమొచ్చినా తనను నేరుగా కలవ వచ్చని చెప్పారు. చిన్నారుల చదువు విషయంలో ఎలాంటి అవసరమొచ్చినా తనను సంప్రదించాలని చిన్నారుల కుటుంబ సభ్యులకు చెప్పారు.

# పేదలకు ఉత్తమ సేవలు అందించాలి

ప్రజాశక్తి-మాచర్ల

సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు ఉత్తమ సేవలు అందించాలని మున్సిపల్ కమిషనర్ ఇవి రమణ బాబు సూచించారు. స్థానిక మెడికల్ అసోసియేషన్ హాల్‌లో లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ముఖ్యఅతిథులుగా రమణబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కోండారెడ్డి, క్లబ్ గవర్నర్ గెస్టు చుండూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో అవగాహన కార్యక్రమాలు, ఇతర సేవా కార్యక్రమాలను పేద వర్గీయులకు అందించాలన్నారు. నూతన క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా మద్దిహరి, కంభంపాటి అంకా ప్రకాష్, కోశాధికారిగా నరసింహారావు ఎన్నికయ్యారు. వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. వీరిని మాజీ మున్సిపల్ చైర్మన్ బత్తుల ఏడుకొండలు, పోలూరి నరసింహారావు, పోలా సత్యనారాయణ, విడేల శ్రీనివాసరావు, ఆడిటర్ కొప్పురావూరి చంద్రశేఖరరావు, అల్లం కోటిరెడ్డి, నామేపల్లి శ్రీనివాసరావు, సికిందర్‌బాషా, చంద్రశేఖర్ అభినందించారు.



## పండగ వేళల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిఐ బ్రహ్మం

ప్రజాశక్తి-అమరావతి

దసరా పండుగ సెలవుల నేప థ్యంలో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు యంత్రాంగం చర్యలు చేపడుతుందని అమరావతి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏవి బ్రహ్మం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని అమరావతి పట్టణ, మండల కేంద్రాలు ,గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా దొంగతనాలు జరగ కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ పాటిం చాలని సూచించారు.



### జాతీయ స్థాయి పరుగుపందెం పోటీల్లో

## 'ఎస్‌ఎస్‌ఎన్' విద్యార్థికి ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తమ కళాశాల విద్యార్థి పరుగుపందెంలో జాతీయ స్థాయిలో ద్వితీయస్థానం సాధించినట్లు ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ సోము మల్లయ్య గురువారం తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హనుమ కొండలో ఈ నెల 15 నుండి 17 వరకు 3 రోజులు పాటు జరిగిన 34వ దక్షిణ భారతదేశ అంతర్ రాష్ట్రాల జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో అండర్-20 విభాగంలో 4X400 మీటర్ల రిలే పరుగు పందెంలో తమ కళాశాలకు చెందిన మొదటి ఏడాది బి.ఎ ఆనర్స్ విద్యార్థి సిహెచ్ వి.ఎం. గురుశంకర్ ఏపీ రిలేటివ్ తరపున పాల్గొన్నాడని తెలిపారు. మూడు నిమిషాల 24 సెకండ్లు 52 ఫ్రాక్షన్ టైమింగ్ తో ద్వితీయ స్థానంతో పాటు రజిత పథకం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ విజయం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా గురుశంకర్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయ్ కుమార్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా, పాలకవర్గ సభ్యులు ఇంటర్మీడియట్ క్యాంపస్ ఇన్చార్జి డాక్టర్ ఎం.ఎస్ సుధీర్, వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ వై. మధుసూదన్‌రావు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు అభినందించారు.


గురుశంకర్‌ను అభినందిస్తున్న విజయ్‌కుమార్, సుబ్బరాయ గుప్తా

## కరపత్రంలో ఎమ్మెల్సీ ఫొటో లేదేంటి?

**ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి**

**ప్రజాశక్తి - మంగళగిరి**

గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ భూమిపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడ్డ రైతులకు ఆర్థిక స్థోమత లేక తమ పిల్లలను పాఠశాల విద్య వరకే చదివిస్తున్నారని, పైచదువులకు వెళ్లలేక చదువు ఆపేస్తున్నారు. ఈ నేప థ్యంలో వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సహకార విద్యాజ్యోతి పథకం కింద రుణాలు అం దించే పథకం తీసుకొచ్చింది. వ్యవసాయ భూమి హామీపై సహకార బ్యాంకుల ద్వారా ఈ రుణాలు అందిస్తారు. దీనికి సంబంధించి బ్యాంక్ అధికారులు విద్యార్థులు, రైతులకు అవగాహన కల్పించేందుకు ఆయా నియోజకవర్గాలలో కరపత్రాలను వాలంటీర్ల ద్వారా పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు. మంగళగిరి పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం రైతు రుణాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు హాజరయ్యారు. రుణాలు పంపిణీ అనంతరం వెళుతున్న ఎమ్మెల్యేకు స్థానిక జీడీసీసీ బ్యాంక్ మేనేజర్ చిన ఖాసీం, విద్యాజ్యోతి పథకానికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యేకు చూపిం చారు. కరపత్రంలో తన ఫొటో మాత్రమే వేశారు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ఫోటో లేదేమిటి? అని ప్రశ్నించారు. తిరిగి కరపత్రములో ఎమ్మెల్సీ మురుగుడు ఫోటో కూడా ముద్రించాలని, ఆ తర్వాతే వాటిని పంపిణీ చేయాలని చెప్పారు. అయితే, ఇప్పటికే సంబంధిత కరపత్రాలు మొత్తం ప్రింట్ అయ్యాయి. ఎమ్మెల్యే సూచనల మేరకు మళ్లీ ప్రింటింగ్ చేసే విషయమై బ్యాంక్ అధికారులు తర్జనభర్జన పడుతుండటం గమనార్హం.



బాల బాలికలతో సిఐ ఆనందరావు

## ఉజ్వల భవిష్యత్ కు విద్య దోహదం

**ప్రజాశక్తి - తుళ్లూరు**

ఉజ్వల భవిష్యత్ కు విద్య దోహదపడుతుందని సిఐ ఎం ఆనందరావు అన్నారు. గురువారం గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ సిస్టర్ లత ఆధ్వర్యంలో మండలంలోని దొండపాడు, అబ్బరాజుపాలెం గ్రామాలకు చెందిన బాల బాలికలు 'ఎక్స్పోజర్ విజిట్' పేరుతో స్థానిక పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుల పనితీరు, బాధ్యతల గురించి బాల బాలికలకు సిఐ వివరించారు. అందరూ కష్టపడి చదువుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆనంద రావు చెప్పారు. అనంతరం బాల బాలికలు గుటూరులోని జిల్లా కోర్టును సందర్శించారు. పోలీస్ స్టేషన్లు, కోర్టుల పని తీరుపై అవగాహన కోసం కార్యక్రమాలు చేపడు తున్న గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులను పోలీస్ అధికారులు, న్యాయవాదులు ప్రశంసించారు.



## అలరించిన చిన్నారుల భరతనాట్యం

**ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్**

దసరా ఉత్సవాలలో భాగంగా, నవరాత్రి వేడుకలను, ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి అమ్మిశెట్టి యూత్ ఆధ్వ ర్యంలో గత ఐదు రోజులుగా స్థానిక నటరాజ కళా మందిరం సెంటర్ వద్ద వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తు న్నారు. నాలుగవ రోజైన బుధవారం రాత్రి చిన్నారులు ప్రదర్శి ంచిన భరతనాట్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని తిలకిం చేం దుకు మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు. కార్యక్రమంలో సిపిఎం కుంచనపల్లి గ్రామ ఒకటవ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రం గారావు, అమ్మిశెట్టి రామారావు, అమ్మిశెట్టి సుధాకర్ పాల్గొన్నారు.

# రైతులకు వ్యవసాయ రుణాలు పంపిణీ

**ప్రజాశక్తి - మంగళగిరి**



మంగళగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో గురువారం సంఘం పరిధిలోని తొమ్మిది గ్రామాలకు చెందిన 24 మంది రైతులకు రెండు కోట్ల ఐదు లక్షల రూపాయల రుణాలను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఆళ్ళ రామకష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు హాజరై రైతులకు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక సహకార సంఘం తొలి విడతడి రైతులకు రెండు కోట్లు, రెండో విడతగా రెండు కోట్ల ఐదు లక్షల రూపాయల రుణాలు పంపిణీ చేసిం దన్నారు. రైతులు పంట పండించుకునే సమయంలో అవసరాలకు తీసుకునే రుణాలను, పంట పండిన తర్వాత తిరిగి చెల్లించినట్లయితే, తర్వాత పంటకు ఎక్కువ రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. రుణాలను సంపూర్ణంగా వినియోగించుకొని రైతులు అభివద్ధి చెం దుతూ, సహకార సంఘం పరపతిని కూడా పెంచడానికి కృషి చేయాలన్నారు. రైతులకు అండగా ఉంటున్న చైర్మన్, పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినం దించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ ఎ.బ్రహ్మయ్య యాదవ్, సభ్యులు ఎస్.సుబ్బారావు, కె.మరియదాసు, మంగళగిరి జిడిసిసి బ్యాంక్ మేనేజర్ చినఖాసిం, సొసైటీ కార్యదర్శి ఆర్.రమేష్, వైసిపి నాయకులు ఎం.మల్లే శ్వరరావు, ఆకురాతి రాజేష్, ఎ.రామకృష్ణారెడ్డి, ఎండి ఫిరోజ్, కె.రాంబాబు, బి.నరసయ్య పాల్గొన్నారు.

**వాకర్స్ ఛార్జీల మినహాయింపునకు వినతి**

ఎకో పార్కు లో వాకింగ్ చేసుకునేందుకు అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఫీజులను వాకర్స్ అసో సియేషన్ సభ్యులకు మినహాయించాలని అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కి సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే ఆర్కే గురువారం ఉదయం ఎకో పార్కును సందర్శించిన సందర్భంగా వారు ఆయనను కలిశారు. ఉదయం 8 గంటల లోపు వాకింగ్ చేసే వారికి చార్జీలు మినహాయించాలని, ట్రెక్కింగ్‌కు వచ్చే వారి నుండి ఛార్జీలు వసూలు చేయవచ్చునని వారు కోరారు. అటవీ శాఖ అధికారులతో మాట్లాడ అంద రికీ అనుకూలమైన ప్రకటన వచ్చేలా చర్యలు తీసు కుంటానని ఎమ్మెల్యే చెప్పారు.

# పురుగు మందుల నాణ్యత తనిఖీలు

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలోని తాడేపల్లి, మంగళ టగిరి, తాడికొండ, తుళ్లూరు పురుగు మందుల నాణ్యత తనిఖీలను నిర్వహించినట్లు ఎడిఎ శ్రీనివాసరెడ్డి తెలిపారు. నకిలీ పురుగు మందుల నియంత్రణ కార్య క్రమంలో భాగంగా పురుగుమందుల దుకాణాల నుండి నాణ్యతపై అనుమానం ఉన్న పురుగు మందుల నమూ నాలు సేకరించి, నాణ్యతా పరీక్షల కోసం పురుగు మం దుల నాణ్యత పరీక్షా కేంద్రానికి పంపినట్లు చెప్పారు. ఆయా మండలాల వ్యవసాయ అధికారులు ఈ తని ఖీలలో పాల్గొన్నట్లు చెప్పారు. తఒమంగళగిరి మండలం నుండి ఇప్పటి వరకు 13 నమూనాలు సేకరించి పంపి నట్లు చెప్పారు. వాటికి సంబంధించి పరీక్ష ఫలితాలు రావాలని చెప్పారు. అలాగే, తాడేపల్లి మండలం నుంచి 6 నమూనాలు, తాడికొండ మండలం నుండి 11, తుళ్లూరు మండలం నుండి 7 నమూనాలు సేకరించి పంపించగా 6 నమూనాలు నాణ్యత ఉన్నట్లు చెప్పారు. మొత్తంగా మంగళ టగిరి సబ్ డివిజన్ పరిధిలో ఇప్పటివరకు 37 నమూనాలు సేకరించి పంపగా, 6 నమూ నాలు నాణ్యతా పరీ క్షలో ఆమోదం పొం



దాయని, 31 నమూనా ఫలితాలు రావాలని అన్నారు. గతంలో తాడేపల్లి మండలంలో విత్తన దుకాణాల నుండి సేక రించిన నమూనాల్లో ఒక విత్తన నమూనా నాణ్యతా పరీక్షలో ఫెయిల్ అయి తక్కువ నాణ్యత కలిగిన విత్తనంగా నిర్ధారణ చేశారని, ఈ విత్తన నమూనాలో 60 మొలక శాతం ఉండాల్సి ఉండగా, 28 మొలక శాతం మాత్రమే ఉందని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సబ్ డివిజన్ పరిధిలో నాలుగు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## వైద్యం.. దూరం

### అందుబాటులో లేని అర్బన్‌హెల్త్ సెంటర్లు

**ప్రజాశక్తి-తాడేపల్లి**

ఇటీవల ప్రభుత్వం ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్లు ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. తాడేపల్లి కొత్తూరు, అమరారెడ్డినగర్‌కు చెందిన ప్రజలు కుంచనపల్లిలో ఏర్పాటు చేసిన అర్బన్ హెల్త్ సెంటర్‌కు వెళ్లాల్సి ఉంది. వైద్య పరీక్షలు అవసరమైన మందులు తీసుకోవాలన్నా మూడు కిలోమీటర్ల దూరం వెళ్లి వైద్య సేవలు పొందాల్సి రావడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ వైద్య సేవల కోసం నిర్మించామని చెబుతున్న అర్బన్ హెల్త్ సెంటర్లు వ్యయాస,భారంగా మారాయని వార్తలు వినిపిస్తున్నాయి. తాడేపల్లి క్రిష్టయన్‌పేటకు చెందిన వారు కూడా కుంచన పల్లి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. ఉండ వల్లి సెంటర్, బోసుబొమ్మ సెంటర్, పద్మశాలీ బజార్‌కు చెం దిన వారు మరో మూడు కిలో మీటర్లు ప్రయాణించి ప్రకాష్‌నగర్ వద్ద గల డ్రైవర్స్‌కాలనీకి, తాడేపల్లి మం డలంలోని చిర్రావూరుకు చెందిన రోగులు వైద్యం కోసం మంగళగిరి రూరల్ మండలానికి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం చెప్పిన విధంగా 'ప్రజల ముంగిటకే ఆరోగ్యం' అనే నినాదం సఫలం కావాలంటే ప్రజలకు అందుబాటులో అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండేలా చూడా లని పలువురు కోరుతున్నారు.

## చర్మకారుల భవనం పరిశీలన

**ప్రజాశక్తి-తాడేపల్లి**



స్థానికఇండియన్ ఆయిల్ బంక్ సమీ పం లో జరుగుతున్న బాబూ జగ్గీవన్‌రామ్ చర్మకార భవన నిర్మాణ పనులను గురువారం స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అధి కారులతో కలిసి పరిశీలించారు. వచ్చే నెల 15 నాటికి నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎండిఒ రాంప్రసన్న, వైసిపి పట్టణ అధ్యక్షులు బి.వేణుగోపాలసోమిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు, ఎం.ప్రకాష్ పాల్గొన్నారు.

## శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో 21న బహిరంగ వేలం పాటలు

**ప్రజాశక్తి-పొన్నూరు రూరల్**

ఈనెల 21వ తేదీన పొన్నూరు పట్టణంలోని శ్రీ సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో బహి రంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో తుల్లిమిల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దేవ స్థానం ఆవరణలో రెండు గోడలను తొలగించి నూత నంగా నిర్మించేందుకు ఈ వేలం పాటలు నిర్వ హిస్తు న్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు పాల్గొనాలని ఈవో పేర్కొన్నారు.



## 'ముస్లింలత సంక్షేమం జగన్‌తోనే సాధ్యం'

**ప్రజాశక్తి-పొన్నూరు రూరల్**

పెదకాకాని మండలం తక్కెళ్లపాడు, ఉప్పలపాడు గ్రామాల్లో గురువారం 'హమ్ సబ్ జగన్ కే సాద్' కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పొన్నూరు నియోజకవర్గ మసీదుల ప్రచార కమిటీ ప్రతినిధి షేక్ నాజర్ పాల్గొని మాట్లాడుతూ రానున్న కాలంలో కూడా ముస్లింల సంక్షేమం జగన్‌తోనే సాధ్యమవుతుందన్నారు. గత పాలకులు ముస్లింలను ఓటు బ్యాంకు గా చూశారే తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. ఈ సందర్భంగా మసీ దుల్లో ఇమాములకు, సరిగ్గా గౌరవ వేతనం అందుతుందా? లేదా? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనం తరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజ ధాని డెవలపర్స్ ఖయుం పాల్గొన్నారు.



## టిఫిన్, తోపుడు బండ్లు పంపిణీ

**ప్రజాశక్తి-మంగళగిరి**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణంలోని 10 మంది చిరు వ్యాపారులకు టిఫిన్, తోపుడు బండ్లు పంపిణీ చేశారు. గురువారం మంగళగిరిలోని మెయిన్ బజార్, గాంధీచౌక్ వద్ద స్థానిక నాయకులు బండ్లను లబ్ధిదారులకు అంద జేశారు. తంగళ్ళపల్లి మాధవిలత, షేక్ నాగూర్ బాషా, మద్దాల సామ్రాజ్యం, గోలి అనంతలక్ష్మిలకు టిఫీన్ బండ్లు అందించగా షేక్ అమీరుల్లా గఫార్, కుక్కల రాజేశ్వరి, షేక్ జలీల్ మెహ్మద్, బుర్రవల్లి సాంబయ్య, దండగిరి దుర్గా భవాని, దూదేకుల మౌలాలిలకు తోపుడు బండ్లు అంద జేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు డి.రాజు, మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర పద్మశాలి సాధికార సమితి సభ్యులు ఊట్ల శ్రీమన్నారాయణ, రాష్ట్ర నాయిబ్రహ్మణ సాధికార సమితి సభ్యులు ఎం.శివశేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



## 40 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు

**ప్రజాశక్తి-మంగళగిరి**

మంగళగిరిలో మహిళల జీవనోపాధి, ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్త్రీ శక్తి కార్యక్రమం ద్వారా కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి వి. ఆషాబాల పేర్కొన్నారు. స్త్రీ శక్తి ద్వారా తాడేపల్లి పట్టణం, తాడేపల్లి రూరల్ మండలాల్లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంగళగిరి టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో గురువారం నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎ.భూలక్ష్మి ఆధ్వర్యంలో సర్టి ఫికెట్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. 28వ బ్యాచ్‌లో 60 రోజుల పాటు శిక్షణ పొందిన 40 మందికి కుట్టు మిషన్లు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వింజమూరి ఆశా బాల, రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి ఎం. వైష్ణవి, ఎ.కుసుమ, కె.పద్మావతి పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ దరఖాస్తుకు 31 వరకు గడువు పెంపు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా దూర విద్యా విధానంలో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో దరఖాస్తునకు ఈనెల 31 వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని, దగ్గర్లోని ఓపెన్ స్కూల్ సెంటర్‌కు వెళ్లి ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని సూచించారు. పదో తరగతిలో ప్రవేశానికి అభ్యర్థులకు 2023 ఆగస్టు 31 నాటికి 14 ఏళ్ల వయసు ఉండాలని, అడ్మిషన్లకు రికార్డు షీటుగానీ, టిసితోపాటు అభ్యర్థి ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్, తల్లి/తండ్రి ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రాలు ఉండాలని తెలిపారు. ఎటువంటి విద్యార్హత లేకపోయినా జనన ధ్రువీకరణ పత్రంతోపాటు స్వీయధ్రువీకరణతో నేరుగా అడ్మిషన్ పొందవచ్చున్నారు. ఇంటర్‌లో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని, టెన్త్ పాస్ సర్టిఫికెట్, అభ్యర్థి ఆధార్, బ్యాంక్ అకౌంట్, తల్లి/తండ్రి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణపత్రాలు అందించాల్సి ఉంటుందన్నారు.

## సెక్యూరిటీ వ్యవస్థను పటిష్టంగా ఉంచండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చెయ్యకపోతే సహించనని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన క్యాజువాల్టీ, కాన్పుల వార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. సెక్యూరిటీ వ్యవస్థను బలోపేతం చేయకపోతే అనేకమంది అనేక రకాలుగా ఆరోపణలు చేస్తున్నారు. వీటిని సరిదిద్దాలనుకుంటే వెంటనే సిబ్బంది సంఖ్యను పెంచలన్నారు. ప్రస్తుతం క్యాజువాల్టి వద్ద ఒకరు మాత్రమే విధుల్లో ఉన్నారు. ఇద్దరు పని చేయాల్సిన చోట ఒకరు అక్కడక్కడా తిరగడం వద్ద క్యాజువాల్టిని పట్టించుకునే వారు కరువయ్యారు. స్వయంగా నేనే రంగంలో కి దిగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రోజుకు ఎంతమంది ఉండాలో షిఫ్ట్ ల వారీగా పని చేస్తున్న వారి వివరాలను అందచేయాలనీ సి ఎస్ ఆర్ యం ఓ కు ఆయన ఆదేశాలు జారీ చేశారు. సూపరింటెండెంట్ వెంట నర్సింగ్ సూపరింటెండెంట్ సమీనా బేగం పాల్గొన్నారు.



భరత్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

## డేటా చౌర్యంపట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

డేటా చౌర్యం పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని లైఫాక్స్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ జి.భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. కళ్లం ఇంజినీరింగ్ కాలేజిలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఆఖరి సంవత్సరం విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీప వారంరోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోకూడదని, ఫోన్‌లో ఓటిపి, పేటియం, గూగుల్‌పే, ఫోన్‌పేలను అప్‌డేట్ చేసుకోమని వచ్చే మెస్సేజ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్ నంబర్‌కు అనుసంధానమైన బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలు గోప్యంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ యం.ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి, ఏఒ కళ్లం నవ్య, సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ వి.రాజీవ్‌బిట్సన్ తదితరులు పాల్గొన్నారు.




## కిట్స్ కాలేజీలో ఇన్నోవేషన్ డే

ప్రజాశక్తి-గుంటూరు

వింజనంపాడులోని కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో గురువారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఇన్నోవేషన్‌డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల నుండి 80 టీములు పాల్గొన్నాయి. విద్యార్థులు తయారు చేసిన ఆవిష్కరణలను మూల్యాంకనం చేయటానికి జిజ్ఞాస ఇంటర్‌ఫేస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ వై.భార్గవ్ పాల్గొని ఉత్తమ ఆవిష్కరణలకు బహుమతులు అందజేశారు. కళాశాల ఛైర్మన్ కె.సుబ్బారావు, సెక్రెటరీ కె.శేఖర్ మాట్లాడుతూ ఐదు ఉత్తమ ఆవిష్కరణలను సమాజానికి ఉపయోగపడే ప్రొడక్ట్స్‌గా అభివృద్ధి చేయటానికి అన్ని వసతులూ, ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, విభాగాధిపతి డాక్టర్ జి.మురళి, ఇన్నోవేషన్స్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎస్.రాధాకృష్ణన్, డాక్టర్ ఎస్.నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న చేదోడును సద్వినియోగం చేసుకోవాలి

### గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, పల్నాడు జిల్లా జెసి ఎ.శ్యాంప్రసాద్

### గుంటూరు జిల్లాలో 8,513, పల్నాడు జిల్లాలో 12798 మందికి నగదు జమ

ప్రజాశక్తి-గుంటూరు

వెనుకబడిన తరగతులకు చెందిన రజక, నాయీబ్రాహ్మణ, టైలర్ వత్తిదారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పదివేల రూపాయల ఆర్థిక లబ్ధిని వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుండి రాష్ట్రవ్యాపంగా చేదోడు ఆర్థిక సాయాన్ని వరుసగా నాలుగో ఏడాది బటన్ నొక్కి లబ్ది దారుల ఖాతాలకు జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని గుంటూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌రావు, రాష్ట్ర కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ మండేపూడి పురుషోత్తం, ఆప్కో ఛైర్మన్ గంజి చిరంజీవి, కష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కోలా భవానీ, ఏ.పి టిడ్కో డైరెక్టర్ కానూరి నాగేశ్వరి, విభిన్న ప్రతిభావంతులు సీనియర్ సిటీజన్ సహాయక కార్పొరేషన్ చైర్ పర్సన్ ముంతాజ్ పఠాన్ , నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ సజీల పాల్గొని వీక్షించారు. అనంతరం జిల్లాలోని 8,513 మంది లబ్దిదారులకు 8 కోట్ల 51 లక్షల 30 వేల చెక్కును లబ్దిదారులకు అందించారు. నాలుగు సంవత్సరాల్లో మొత్తం 37 కోట్ల 48 లక్షల 30 వేల రూపాయల ఆర్థిక లబ్ది చేకూర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గా బాయి , లబ్దిదారులు పాల్గొన్నారు.


గుంటూరులో మెగా చెక్కును అందచేస్తున్న కలెక్టర్, ప్రజా ప్రతినిధులు



నరసరావుపేటలో మెగా చెక్కును అందచేస్తున్న జెసి తదితరులు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా :** జగనన్న చేదోడు 4వ విడత కింద దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు నగదు జమను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుండి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పల్నాడు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి అధికారులు, లబ్దిదారులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రూ.10 వేల ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 12798 మందికి రూ.12 కోట్ల 79 లక్షల 80 వేలు మంజూరైనట్లు తెలిపి మెగాచెక్కును లబ్ధిదార్లకు అందించారు. నియోజకవర్గాల వారీగా నరసరావుపేట నియోజకవర్గం నుండి 2550 మంది, మాచర్ల నియోజకవర్గం 2436, పెదకూరపాడు 2240, గురజాల 1634, చిలకలూరిపేట 1607, వినుకొండ 1303, సత్తెనపల్లి 1028 మందికి వారి ఖాతాల్లో నగదు జమైనట్లు జెసి తెలిపారు.

# 23న విజ్ఞాన్స్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

### హాజరు కానున్న కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు మండలం, వడ్లమూడిలోని విజ్ఞాన్స యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవం ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. మంగళవారం యూనివర్సిటీలో స్నాతకోత్సవం బ్రోచర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతు ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ ఫైనాన్స్, కార్పొరేట్ అఫైర్స్ మినిస్టర్ నిర్మలా సీతారామన్, అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ డాక్టర్ సుబ్బారావ్ పావులూరి, విమ్‌టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ ఎస్‌పీ వాసిరెడ్డి, ఇండియన్ చెస్ ప్లేయర్, పద్మశ్రీ, అర్జున అవార్డు గ్రహీత కోనేరు హంపి హాజరవుతున్నారని తెలిపారు. ఈ స్నాతకోత్సవంలో వివిధ రంగాలలో సేవలు అందించినందుకుగాను డాక్టర్ సుబ్బారావ్ పావులూరి, డాక్టర్ ఎస్‌పీ వాసిరెడ్డి, కోనేరు హంపిలు గౌరవ డాక్టరేట్లు అందుకోనున్నట్లు చెప్పారు. అలాగే 1800 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా బ్రాంచిల వారీగా అత్యుత్తమ ప్రతిభ చూపిన 24 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తామన్నారు. వీటితో పాటు బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ మెడల్, ఎండోమెంట్ అవార్డులు, బహుముఖ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ఛైర్మన్ బంగారు పతకం, బెస్ట్ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సోషల్ ఎంగేజ్‌మెంట్ అవార్డు, బెస్ట్ లీడర్ మెడల్స్ ఉంటాయన్నారు. వివిధ విభాగాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు కూడా ప్రత్యేక బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.


బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ, తదితరులు

# సొల్యూషన్స్ 3 ఎక్స్‌తో చలపతి ఫార్మసీ ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు

న్యూయార్క్‌కు చెందిన సొల్యూషన్స్ 3 ఎక్స్ కంపెనీ లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి సమీవుల్లా మహమ్మద్ మాట్లాడుతూ సాంకేతిక యుగంలో విద్యార్థుల నైపుణ్యాలను అంచనావేస్తూ ప్రత్యేకమైన శిక్షణా కార్యక్రమాలను రూపొందించి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నేటి విద్యార్థులను తీర్చిదిద్దటమే ధ్యేయంగా కంపెనీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.మెడికల్ కోడింగ్, మెడికల్ స్క్రబింగ్, ప్రత్యక్ష ప్రాజెక్టులను నెలకొల్పటం, ఉమ్మడి సాంకేతిక పరిశోధన, సాఫ్ట్‌స్కిల్స్, ఇంక్యుబేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ లాంటి పలు అంశాలపై దృష్టి సారించి నిర్దేశిత లక్ష్యాలతో కూడిన పాఠ్యప్రణాళికను సిద్ధం చేసి సర్టిఫికెట్ ప్రోగ్రామ్స్ ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించటం జరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ వైద్య విధానాలు ఎంతో అభివృద్ధి చెందుతున్న ఈరోజుల్లో మెడికల్ కోడింగ్ లాంటి వృత్తికి ఎంతో ప్రాధాన్యత పెరిగిందని, కార్పొరేట్ హాస్పిటల్స్, ఇన్సూరెన్స్ కంపెనీలు, ల్యాబ్స్, ఫార్మా కంపెనీలో కోడింగ్ సేవలు అవసరమని అన్నారు. అనంతరం అతిథిని సత్కరించారు.


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న కంపెనీ ప్రతినిధి, కళాశాల ప్రిన్సిపల్